కథ



# మౌనమే శరణ్యం

-తమిరిశ జానకి

''ఏవరబ్బాయ్ నువ్వు? ఏం కావాలి?''

''ఏదన్నా పని ఇప్పించండమ్మా ... చేస్తాను.''

''నువ్వా? ఏం పన్లు చేస్తావు?''

''ఇంట్లో పన్లు బైటపన్లు ఏవైనా చేస్తానమ్మా. మీరే పని చెప్పినా చేస్తాను. ఇక్కడే మీ ఇంట్లోనే పడుంటాను. ఈ బైట వరండాలో పడుకుంటాను'' పరీక్షగా ఆ పిల్లాడి వంక చూసింది సుమతి.

పదమూడేళ్ళుంటాయేమో! మొహమ్మీద స్ఫోటకమ్మచ్చలు ... సన్నగా నీరసంగా ఉన్నాడు.

''మీ ఇల్లెక్కడా? మీ అమ్మ ఎవరింట్లోనన్నా పని చేస్తోందా?''

''నాకెవ్వరూ లేరండి...''

''అయ్యో పాపం! ఈ ఊరేనా?''

''ఔనండీ...''

''ఎవరు సుమతీ? ఎవరబ్బాయి?'' అప్పుడే గదిలోంచి అవతలికొచ్చిన రామ్మూర్తి అడిగాడు.

''ఎవరో అనాధ పిల్లాడండీ ... పనికి పెట్టుకుంటారా అని అడుగుతున్నాడు.''

''ఓ! ఇంతవరకూ పని మనిషెవరూ కుదరలేదని బాధపడుతున్నావుగా ...''

''ఔనండీ ... మనం ఈ ఊరొచ్చి మూడు నెల్లయింది ... ఇంతవరకూ స్థిరంగా ఏ పని మనిషీ కుదర్లేదు.''

''ఇంకనేం? ఈ కుర్రాడిని పెట్టుకుని చూడు. పన్లు బాగా చేస్తే కంటిన్యూ చెయ్యచ్చు. లేకపోతే అప్పుడే ఇంకోళ్ళని చూసుకోవచ్చు.''

''ఔనంతే. అలాగే చేద్దాం. నీ పేరేవిటబ్బాయ్?'' అడిగింది సుమతి.

''నా పేరు రంగడండీ ... రంగా అని పిలవండి.''

''ఆ. చూడు రంగా! మరి ... పన్లు చక్కగా చెయ్యగలవా?''

''చేస్తానండీ ...''

''ఇదుగో మా పిల్లాడిని కూడా ఆడించాలి. నేను పని చేసుకునేటప్పుడు వాడిని నువ్వే పట్టుకోవాలి'' కింద కూచుని ఆడుకుంటున్న రెండేళ్ళ కొడుకు కిషోర్ని చూపించింది.

''బాబుని జాగర్తగా చూసుకుంటానండీ. ఇంట్లో పన్లు, బజారు పన్లు అన్నీ ఏం చెయ్యమన్నా చేస్తానండీ ...''

''సరే అయితే ... జీతం ఎంతో చెప్పు ...''

''మీ ఇష్టవండీ ... మీరే ఆలోచించి ఇవ్వండి ...''

అలా పన్లో చేరాడు రంగడు.

☆☆☆

మధ్యాహ్నం భోజనమయ్యాక వారపత్రికేదో చదువుతూ గదిలో పడుకునుంది సుమతి. గది గుమ్మంలో ఏదో అలికిడి అయినట్టయి ఓరగా తల తిప్పి చూసింది. తలుపుపక్కగా నిలబడి లోపలికి తొంగి చూస్తున్న రంగడు చటుక్కున పక్కకి తప్పుకోడం కనిపించింది. ఎందుకు ... ఎందుకలా రహస్యంగా చాటుగా నిలబడి చూస్తున్నాడు? పుస్తకం పక్కన పెట్టి లేచి గదిలోంచి ఇవతలికొచ్చింది. చాప మీద కూచుని బొమ్మల్తో ఆడుకుంటున్న పిల్లాడి పక్కన ఏవీ ఎరగనట్టు కూచున్నాడు రంగడు.

''ఏం కావాలి రంగా?''

''ఏం అక్కర్లేదమ్మ గారూ!'' తడబడ్డాడు కొంచెం.

''ఏదో అడగాలని అక్కడికొచ్చినట్టున్నావు?'

''నేనా? ... లేదమ్మ గారూ...''

పుస్తకం చదువుతూ నిద్రమత్తొచ్చి తనే ఏదో పొరపాటుపడి ఉంటాననుకుంది సుమతి.

☆☆☆

ఆ రోజు రామ్మూర్తి ఆఫీసునించి ఇంటికొచ్చేసరికి భోరుమని ఏడుస్తూ ఎదురుపడింది సుమతి. కంగారుపడిపోతూ అడిగాడు ''ఏవైంది సుమతీ?''



''కిషోర్ కనిపించట్లే దండీ ... రంగడూ కిషోర్ ఇద్దరూ లేరు.''


రంగడు కూడా లేడనే సరికి కొంచెం ధైర్యం వచ్చింది రామ్మూర్తికి.

''పిల్లాడిని షికారు తిప్పడానికి తీసి కెళ్ళుంటాడు రంగడు. దానికే ఇంత భయపడిపోయి ఏడుస్తున్నావా?'' ఓదార్చబోయాడు.

''లేదండీ ... గంటసేపట్నించీ వెతుకుతున్నాను. విమలెందుకో రమ్మంటేను నేనో అరగంట వాళ్ళింటి కెళ్ళొచ్చాను. పిల్లాడు, రంగడు ఇంట్లోనే ఉన్నారు. నేనొచ్చే టప్పటికీ వీధి తలుపులు లోప ల్నించి వేసి ఉన్నాయి. ఎంత సేపు తలుపు కొట్టినా రంగడొచ్చి తియ్యకపోయే సరికి వెనక వైపుకి వెళ్ళాను. పెరటి తలుపులు దగ్గిరగా వేసి ఉన్నాయి. లోపలికెళ్ళి చూస్తే ఇద్దరూ లేరు. ఇరుగుపొరుగు అందరిళ్ళల్లో అడిగాను. ఎవరూ చూడలేదన్నారు. ఈ వీధంతా ఈ చివర్నించి ఆ చివరికి ఎన్నిసార్లో తిరిగి చూశాను. ఎక్కడా లేరు'' దుఃఖం ఆపుకోలేక రెండు చేతుల్లో మొహం దాచుకుని కింద కూల బడిపోయింది సుమతి.

''భయపడకు సుమతీ. పిల్లాడిని తిప్పుతూ ఈ పక్క వీధిలోకో ఆ పక్క వీధిలోకో వెళ్ళిపోయుంటాడు రంగడు. అక్కడేవో వింతలూ విడ్డూరాలు కనబడితే చోద్యం చూస్తూ నిలబడిపోయుం టాడు. వాడూ చిన్న కుర్రాడేగా ... నేవెళ్ళి వెతుకుతాను. కనపడక పోతే పోలీసు రిపోర్టిచ్చొస్తాను ... నువ్వేం కంగారు పడకు'' భార్యకి ధైర్యం చెప్పాలని చెప్పాడేగానీ రామ్మూర్తికి కాళ్ళూ చేతులూ వొణు కుతున్నాయి ఏం జరిగిందో ఏమోనని.

ఓ గంటసేపు స్కూటరేసుకుని ఆ చుట్టుపక్కల వీధులన్నీ వెతికి చివరికి పోలీసు రిపోర్టు ఇచ్చి పిల్లాడి ఫోటో కూడా ఇచ్చివొచ్చాడు రామ్మూర్తి. తను వెళ్ళేటప్పుడు ఏడుస్తూ వీధరుగు మీద కూర్చున్న సుమతి ఆ స్థితిలోనే ఉంది. పక్కింటావిడ, ఎదురింటావిడ ధైర్యం చెప్తూ ఓదారుస్తున్నారు. దిగాలుగా మొహం వేలాడేసుకునొచ్చిన భర్తని చూడగానే సుమతి దుఃఖం రెట్టింపయింది. మరో అరగంటలో పోలీసు స్టేషన్నించి ఫోనొచ్చింది పిల్లవాడు దొరికాడని.



గుండె తేలికపడి... ఏడుపూ సంతోషం కలగలుపుగా ఆఘమేఘాల మీద చేరుకున్నారక్కడికి.

కొడుకుని చూస్తేనే కిషోర్ అంటూ ఏడుస్తూ వెళ్ళి వాడిని అక్కునజేర్చుకుంది సుమతి. ఎదురుగా కుర్చీ చూపిస్తూ కూర్చోమన్నాడు ఇన్‌స్పెక్టర్.


రామ్మూర్తి కూర్చుంటూ ఆతృతగా అడిగాడు ''ఎక్కడ కనిపించారు ఇన్‌స్పెక్టరు వీళ్ళు? రంగడు... అదే... మా పని కుర్రాడు ఏడీ?''

''సారీ ... రామ్మూర్తి గారూ ... ఆ కుర్రాడు లారీ యాక్సిడెంట్లో పోయాడు. ఆ కుర్రాడి తాలూకు వాళ్ళెవరైనా ఉన్నారా?''

''తనకెవ్వరూ లేరు అనాధనని చెప్పాడండీ... ఈ మధ్యనే మా



## పాత వెర్సస్ కొత్త!



సల్మాన్ ఖాన్ – రచయితల జంట సలీం జావేద్‌లోని సలీంఖాన్ (హీరో) పుత్రుడు. అమ్జాద్‌ఖాన్ (విలన్) జయంత్ (విలన్) పుత్రుడు. అనూమాలిక్ (సంగీత దర్శకుడు) – గర్దార్ మాలిక్ పుత్రుడు. ఆర్.డి.బర్మన్ (సంగీత దర్శకుడు) – ఎస్.డి.బర్మన్ పుత్రుడు. ఆదిత్య చోప్రా – యాష్ చోప్రా తనయుడు.

ఇంట్లో పనికి కుదిరాడు. మా ఇంట్లో పనికి కుదిరే రోజుదాకా మేము ఆ కుర్రాడిని ఎప్పుడూ చూడలేదు'' రంగడి మరణవార్త విని గుండెల్లో కలుక్కుమంది భార్యాభర్తలిద్దరికీ.

''అలాగా... ఆ కుర్రవాడు ఒక చేతిలో మీ బాబు, ఒక చేతిలో సంచీతో విజయవాడ రోడ్లో వెళ్తున్నాడుట. మీ బాబు బాగా ఏడుస్తుంటే బిస్కట్లు కొనిపెట్టడానికి బాబుని రోడ్డు పక్కన కూచోపెట్టి తను రోడ్డు క్రాస్ చేసి అక్కడున్న బడ్డీకొట్టు దగ్గిరికి వొచ్చాడుట. బిస్కట్లు లేవు రస్కులే ఉన్నాయని ఆ కొట్టువాడంటే సరే ఆ రస్కులే ఇమ్మన్నాడుట. అవి తీసుకుని డబ్బులిచ్చేసి తిరిగి రోడ్డు క్రాస్ చేసేటప్పుడు ఎదురుగా స్పీడ్‌గా వొస్తున్న లారీ చూసి కూడా అది వొచ్చే లోపల దాటెయ్యలేకపోతానా అనుకున్నాడు కాబోలు. దాటబోయి లారీక్రింద పడ్డాడు. ఆన్ ది స్పాట్ ప్రాణం పోయింది. ఆ బడ్డీ కొట్టువాడు, ఆ పక్కన కూచుని కబుర్లు చెప్పుకుంటున్న కొందరు రిపోర్టిచ్చారు. యాక్సిడెంట్ అని ప్రత్యక్షసాక్ష్యం ఉంది.''

''ఎంత ఘోరం జరిగిపోయింది ... అయినా మా పిల్లాడిని తీసుకుని ఎక్కడికి పోతున్నట్టు? నాకేమీ అంతుపట్టట్లేదు'' ఆశ్చర్యంతో అన్నాడు రామ్మూర్తి.

''మీరీ కాగితమ్మీద సంతకంపెట్టి మీ పిల్లాడిని తీసికెళ్ళొచ్చు. ఏదైనా అవసరం పడితే మీకు కబురు చేస్తాం. మీరు రావాల్సి ఉంటుంది.''

''అలాగేనండీ...''

☆☆☆

**ఇం**టికి రాగానే కిషోర్‌కి స్నానం చేయించి, పాలు తాగించి అప్పుడు మెల్లిగా వంట ప్రయత్నంలో పడింది సుమతి.

వంటింట్లో తూము దగ్గిర చెమ్మలోపడి ఉన్న ఓ పెద్ద కాగితమ్మీద దృష్టి పడింది. యాధాలాపంగా ఆ కాగితం చేతిలోకి తీసుకుని చూసింది.

''అయ్యగారూ, అమ్మగారూ'' అన్న సంబోధనతో మొదలై ఉందది. చటుక్కున కాగితం వెనక్కి తిప్పి కింద సంతకం చూసింది ''రంగడు'' అని ఉంది.

ఆదుర్దాతో... ఆతృతతో... భయంభయంగా... కంగారుగా కళ్ళు అక్షరాల వెంట పరుగులు తీశాయి.

''అయ్యగారూ, అమ్మగారూ,

నేనెవరో, మీ ఇంట్లో ఎందుకు చేరానో మీకు తెలియదు. పగ తీర్చుకోడానికి మీ ఇంట్లో పన్లో చేరాను. నన్ను పెంచిన తాత చనిపోయాడు. పోయేటప్పుడు నాకో రహస్యం చెప్పాడు. తనూ ఈ మధ్యనే మిమ్మల్ని, మీ ఇల్లూ చూశాడుట. నా కన్నత ...'' ''త'' అక్షరం తర్వాత చెమ్మలో తడిసిపోయి పూర్తిగా సిరా పాకిపోయింది. అక్షరాల్లేవు. రెండవ లైన్లో కింద వాక్యం పూర్తయి ఉంది. ''ఈ ఇంట్లోనే ఉన్నట్టు ... కొత్తగా ఈ ఇంట్లోకి వచ్చినట్టు ... ఇంటి గుర్తులు ... ఇంటి నెంబరు అన్నీ చెప్పాడు... ఇదివరకు మీరున్న ఊళ్ళోనే మేమూ ఉండేవాళ్ళం. అప్పుడీ విషయం నాతో చెప్పలేదు తాత. దాచిపెట్టాడు. మేమూ ఈ మధ్యనే ఆర్నెల్లయింది ఈ ఊరొచ్చి ... మిమ్మల్ని చూసి గుర్తు ...'' అక్కడా లైనంతా తడిసిపోయి అలుక్కుపోయి ఉంది.

''పోయే ముందు నిజం చెప్పిపోయాడు ... మీమీద కోపం వచ్చింది ... మీ ఇద్దరూ కిషోర్ని తీసుకుని షికార్లకెళ్ళడం, పార్కులకెళ్ళడం, షాపులకెళ్ళడం అన్నీ చూశాను. నా కసి ఇంకా పెరిగింది ... పగ తీర్చుకోడానికి ... కసి తీర్చుకోడానికి సినిమాల్లో ఎన్నెన్నో పద్ధతులు చూపిస్తుంటారు. అలా చెయ్యాలి అనిపించింది. అందుకే మీ ఇంట్లో పని వాడిగా చేరాను ... తల్లీ తండ్రీలేని అనాధలా కిషోర్ పెరగాలి ... అదే నేను కోరుకున్నది ... సమయం కోసం ఎదురు చూస్తూ గడిపాను... ఆ సమయం ఈ రోజొచ్చింది. కిషోర్ని నాతో తీసుకు పోతున్నాను...''

నిల్చున్న చోటే కింద కూలబడిపోయింది సుమతి.

ఈ రంగడు ... తన కొడుకేనా? ... అంతే ... అంతే ... తన

కొడుకే ... పైన ''కన్నత ... పక్కన చెరిగిపోయిన చోట 'కన్నతల్లి' అని పదే పదే చదువుకుని మోకాళ్ళల్లో తలదూర్చుకుని కుమిలి కుమిలి ఏడుస్తోంది ... గతం కళ్ళ ముందు మెదిలింది.

దినకర్ని తను ప్రేమించిన మాట నిజం ...

అతన్నే పెళ్ళి చేసుకోవాలనుకున్న మాటా నిజం ...

మనసూ, తనువూ అర్పించుకుంది అతనికి ...

తీరా దినకర్ విషయం ఇంట్లో చెప్పేటప్పటికి ఇంట్లో కురుక్షేత్రమే ... తమ కులంకాదు ... తమ అంతస్తుకి తగ్గవాడు కాదు... అలాంటి వాడి ఇంటికి అల్లుడిగా రావడానికి వీల్లేదు ... ఇంట్లో అందరిదీ అదే పాట... గుండెల్లో రైళ్ళు పరిగెడుతుండగా అసలు విషయం బయట పెట్టింది ... తను తల్లి కాబోతోంది అని ... అంతే ... పొరుగూరు లాక్కుపోయారు ... డాక్టర్ చెకప్ ... మాటలు ...అమ్మాయి చాలా బలహీనంగా ఉంది ... ఇప్పుడు లాభం లేదు ... మంచిది కాదు ... ఏడుపులూ ... అరుపులూ ... కోపాలూ ... తాపాలూ... విసుగులూ... తిట్లూ... చివరికి కొన్నాళ్ళు అదే ఊళ్ళో ... అమ్మా, తనూ చిన్నన్నయ్య సాయంతో ఉండిపోడం...

నర్సింగ్ హోమ్‌లో తను పిల్లాడిని కన్నది... నా అన్న వాళ్ళెవరూ లేని ఒక పెద్దాయన తను పెంచుకుంటాననంటే పిల్లాడిని ఆయనకిచ్చేశారన్న విషయం తర్వాత తెలిసింది తనకి ... బాధపడింది ... ఏడ్చింది .. తననితనే తిట్టుకుంది ... అంతకంటే ఏం చెయ్యాలో ... ఏం చెయ్యగలదో తనకి తెలియలేదు...

ఆ పిల్లాడే ఈ రంగడా? తనకన్న కొడుకే ఈ రంగడా? ... ఈ పాపం తనని ఊరికే వొదిలిపెడుతుందా?

''ఏం చేస్తున్నావు సుమతీ? వంటైపోయిందా?'' వంటింట్లో కొచ్చిన రామ్మూర్తి తెల్లబోయాడు భార్యని చూస్తూనే.

''ఏవిటదీ? అలా ఉన్నావేమిటి? ఆ కాగితం ఏవిటి చేతిలో?'' సుమతి చేయి వణికింది. భయంభయంగా చూసింది. సుమతికి ఎదురుగా కూచుని ఆమె చేతిలోంచి కాగితం అందుకున్నాడు.

చదువుతున్న రామ్మూర్తి మొహంలో రంగులు మారాయి.

కాగితంలో ''కన్నత ...'' పక్కన పూర్తిగా తడిసిపోయిన చోట ''కన్నతండ్రి'' అని చదువుకున్నాడు...

ఈ రంగడు తన కొడుకే అన్నమాట ... ఆ ఆలోచన మనసుని కుదిపేసింది. ఇప్పుడు దీనిద్వారా రంగడి కన్నతండ్రి తనే అన్న విషయం సుమతికి తెల్సిపోయింది ... తనకీ ఇప్పుడేగా తెల్సింది ...

తలెత్తి భార్య మొహంలోకి చూడడానికి భయం వేసింది.

ఒకప్పుడు ... మాలతిని ప్రేమించాడు తను ...

పెళ్ళి చేసుకుంటానని కూడా మాటిచ్చాడు ... నమ్మింది ... తండ్రి తప్ప నా అన్న వాళ్ళెవరూ ఇంకెవ్వరూ లేరు తనకి. కులాలు ఒకటి కాకపోయినా ... ఈ పెళ్ళికి తన తండ్రిని ఒప్పించడం కష్టం కాదంది...

తను తల్లి కాబోతున్నానని చెప్పింది కూడా ...

తన అభిప్రాయంతో ఇంట్లో ఎవరూ ఏకీభవించలేదు ... అందరూ తనకి ఎదురు తిరిగారు ... ఆస్తిలో ఒక్క పైసా ఇచ్చేది లేదన్నాడు తన తండ్రి ... అన్నయ్యలు కూడా బెదిరించారు.

వాళ్ళు చూసిన సంబంధానికే తలవొంచాడు. మాలతిని మరి కలవలేదు. ఆమె ఏమయ్యిందో .. ఎక్కడుందో కూడా పట్టించుకోలేదు. కొన్ని నెలల తర్వాత ఆమె ఆత్మహత్య చేసుకుందన్న వార్త ఎవరి ద్వారానో మాటల్లో తెల్సింది. అంటే ... బిడ్డని కని తండ్రికి అప్పగించి ఆత్మహత్య చేసుకుందన్న మాట ...

రామ్మూర్తి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి...

తలెత్తి భార్య మొహంలోకి చూడటానికి ఏదోలా ఉంది ... తప్పు చేసిన వాడి మనస్థితి ... భార్య ముందు తలదించుకునే అవస్థ ... సుమతి పరిస్థితీ అలాగే ఉంది ...

పెళ్ళికి ముందు తను వేసిన తప్పటడుగు భర్తకిప్పుడు తెల్సింది ...

ఎలా అతని మొహంలోకి చూడటం?

పెళ్ళికి ముందు ప్రేమ కథ నడిపావన్న మాట ...

ఓ బిడ్డకి తల్లి కూడా అయ్యావన్నమాట ...

వ్యంగ్యంగా ... కోపంగా భర్త తనని అడుగుతున్నట్టు అనిపించింది.

తలదించుకునే ఉన్న రామ్మూర్తికి ...

పెళ్ళికి ముందు పెద్ద గ్రంథమే జరిపారన్న మాట అంటూ సుమతి తన వంక కోపంతో ... తక్కువ భావంతో ... అదో రకంగా ... అయిష్టంగా ... చూస్తున్నట్టు అనిపించింది.

మనసుల్లో వేదనతో మౌనాన్ని ఆశ్రయించారు ఇద్దరూ.



## జూహీతో బుల్లి ఇంటర్వ్యూ

★ మీరు తొలిసారి ఇష్టపడ్డ హీరో ఎవరూ?

– టామ్‌క్రూయిస్, బ్రాడ్ పిట్ (అప్పటికి జాయ్ దొరకలేదు)

★ మీకిష్టమైన చిన్నప్పటి బొమ్మ ఏంటో?

– నా పెద్ద టెడ్డీ బొమ్మ (మరే!)

★ మీరు కొన్న తొలి కాసెట్ ఏది?

– జార్జి మైకేల్, కెన్నీ జీ (జాయ్ గారికి సంగీతం రాదు)

